క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ మల్లేశ్

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపాలి

జైనూర్, జనవరి 9 : విద్యార్థులో క్రీడా స్ఫూర్తి నింపాలని జైనూర్ సీఐ మల్లేశ్ అన్నారు. మండలంలోని మార్లవాయిలో బెట్టి ఎలిజబెత్ స్మారక క్రీడా ఉత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, శరీర దారుఢ్యం పెరుగుతుందని సీఐ అన్నారు. ఈ క్రీడా ఉత్సవాల్లో ఆశ్రమ హై స్కూల్ హెచ్ఎం వెంకటరమణ, ఏటీడీవో పురుషోత్తం, ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్, ఉప సర్పంచ్ సావిత్రి ధర్మేందర్, యూత్ సభ్యులు ఆత్రం మాణిక్, సోనేరావ్, మధు, భుజంగ్‌రావ్, యాదవ్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

మత్తడి సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు మృతి

కొట్రంగి పోచు మేరా (ఫైల్)

బెజ్జూర్, జనవరి 9 : మండలంలోని మత్తడి (స్పింగ్ ఆనికట్) సాగు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కొట్రంగి పోచుమేరా (90) మంగళవారం మృతిచెందారు. మండంలోని ఎల్కపల్లి గ్రామంలో నివాసం ఉంటూ కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. మంగళవారం తెల్లవారుజామున తన నివాసంలోనే మృతి చెందారు. తన హయాంలో సాగు నీటి సంఘం ఆధ్వర్యంలో రైతుల సంక్షేమానికి కృషి చేశారు. పలు రాజకీయ పార్టీల నాయకులు తన పార్థివదేహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్

బెజ్జూర్, జనవరి 9 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. వికాసిత్ భారత్ యాత్రలో భాగంగా మండంలోని మర్తిడి, లంబాడి గూడ గ్రామాల్లో మంగళవారం ఆయా శాఖల అధికారులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భద్రయ్య, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ గోపి, స్థానిక ఎంపీటీసీ గురిజాల వెంకన్న, కార్యదర్శి గురుదాస్, సీఎఫ్ఎల్ సిబ్బంది రాజాబాబు, శేఖర్, నాయకులు బాలకృష్ణ, తిరుపతి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

దహెగాం, జనవరి 9 : మండల సరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు హాజరవ్వాలని సూచించారు. అలాగే అధికారులు తమ శాఖలకు చెందిన పూర్తి నివేదికలతో రావాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..

బాలస్వామి(ఫైల్)..

కౌటాల, జనవరి 9 : కౌటాల పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయనగరం గ్రామానికి చెందిన పొలిశెట్టి బాలస్వామి(48) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ మధూకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బాలస్వామి కుటుంబ సభ్యులు ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. వ్యవసాయ పనులు ఉన్నందున బాలస్వామి ఇంటి వద్దే ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గుడ్లబోరి గ్రామ శివారులోని పొలానికి బైక్‌పై వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు కల్వర్టుకు ఢీ కొట్టి కిందపడిపోయాడు. రాత్రి కావడంతో ఎవరూ చూడలేదు. కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా తియ్యలేదు. అనుమానం వచ్చి, కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి ఊరికి వచ్చి వెతికారు. కల్వర్టు వద్ద మృతదేహం కుల్లిపోయి కనిపించింది. బిడ్డ ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసుతన్నట్లు ఎస్ఐ తెలిపారు. బాలస్వామికి భార్య, ఇద్దరు బిడ్డలు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

రెబ్బెన, జనవరి 9 : సంక్రాంతి పండుగ సెలవులకు ఇండ్లకు వెళ్లే వారు పోలీసుల నిబంధనలు పాటించాలని రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇంట్లో విలువైన బంగారం, డబ్బులు లాకర్‌లలో భద్రపర్చుకోవాలని సూచించారు. సెంట్రల్ లాకింగ్ వాడాలని, ఇంటి ఆవరణలో మెయిన్ గెట్‌కు తాళం వేయకుండా ఉండాలని తెలిపారు. ఇంటి డోర్‌కు తాళం వేసి కర్టెన్‌తో కవర్ చేయాలని, ఇంటి ముందు లైట్ అన్ చేసి ఉంచాలని పేర్కొన్నారు. ఎటైనా వెళ్లే సమయంలో సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. సీసీ కెమెరాలు పని చేసేలా మంచి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని, అపరిచిత వ్యక్తులు వస్తే వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. ఇరుగుపొరుగు వారికి ఇంటిని కనిపెట్టాలని చెప్పడం, పక్కింటి వారి ద్వారా ఇంటి సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడం వంటివి చేయాలని తెలిపారు. కాలనీవాసులు గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏ సమాచారం ఉన్నా డయల్ 100కు ఫోన్ చేయాలని తెలిపారు.

60 మందికి ఉద్యోగోన్నతి

రెబ్బెన, జనవరి 9 : బెల్లంపల్లి ఏరియాలో ఒకే కేటగిరీలో ఎనిమిదేండ్ల పాటు విధులు నిర్వహించిన 60 మంది ఉద్యోగులు ఉద్యోగోన్నతి పొందారని ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగోన్నతి పత్రాలను ఉద్యోగులు పని చేసే గనులు, డిపార్టుమెంట్లకు పంపించామని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
దేవాదాయ ధర్మాదాయశాఖ
శ్రీ నాగోబా దేవాలయము, కేస్లాపూర్ గ్రా॥, ఇంద్రవెల్లి మం॥, ఆదిలాబాద్ జిల్లా

లేఖ సంఖ్య: 02/2024 తేది: 08-01-2024

బహిరంగ వేలం ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు మరియు భక్తులకు తెలియజేయునది ఏమనగా! శ్రీ నాగోబా దేవాలయము, కేస్లాపూర్ గ్రా॥, ఇంద్రవెల్లి మం॥, ఆదిలాబాద్ జిల్లా నందు తేది: 09.02.2024 నుండి తేది: 15.02.2024 వరకు జరుగు శ్రీ నాగోబా జాతర సందర్భముగా తాత్కాలికముగా 1.తైబజార్ నిర్వహించుహక్కు 2.వాహన పార్కింగ్ నిర్వహించుకొను హక్కు, 3.విద్యుత్ కనెక్షన్ ఇచ్చుకునే హక్కు 4. ప్యాలాలు, పుట్నాలు అమ్ముకునే హక్కు 5. కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకొను హక్కు తేది: 17.01.2024 బుధవారము రోజున ఉదయము 11.00 గంటలకు సదరు దేవాలయము వద్ద బహిరంగ వేలం పాట జరుగును. కావున ఆసక్తి గలవారు పాల్గొనవలసిందిగా కోరుచున్నాము. ఇతర వివరములకు దేవాలయ కార్యాలయములో సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి 9966889222

మద్దతు ధర అంతంతే..

రైతు ఇంటి వద్ద ఖాళీ స్థలంలో ఇలా పత్తి నిల్వ

- ధర లేక పత్తి రైతుకు నష్టమే
- తేమ సాకుతో కోత!
- ఆందోళనలో అన్నదాత

వాంకిడి, జనవరి 2 : వాంకిడి మండలంలోని పత్తి రైతుకు మద్దతు ధర దక్కడం లేదు. సాగు మొదలుకొని పంట విక్రయించే దాకా అష్టకష్టాలు పడ్డా గిట్టుబాటు కావడం లేదు. తేమశాతాన్ని సాకుగా చూపుతూ ధరల్లో మోసం చేయడంతో అన్యాయం జరుగుతున్న కర్షకులు వాపోతున్నారు. సీసీఐ నిబంధనలతో పత్తి దిగుబడికి ఆశించిన మేరకు గిట్టుబాటు ధర లభించకపోవటంతో మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. కొద్దిగా తేమ శాతం ఎక్కువైనా తిరస్కరించి, మద్దతు ధర చెల్లించడంలేదు. వాంకిడి మండలంలో పత్తి కొనుగోలు చేసేందుకు 3 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలి. కానీ, స్థానికంగా అధికారులు తేమ సాకు చూపడంతో 'మద్దతు' లభించడంలేదు. సీసీఐ మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020 చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుతం తేమ ఉన్నదని, రూ.6,800 ఇస్తున్నారని రైతులు అంటున్నారు. ఇదిలా ఉండగా, గతేడాది కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మద్దతు ధర వస్తుందని ఆశపడ్డ రైతులు 35 శాతం మంది ఇండ్లలోనే పత్తిని నిల్వ చేశారు. మళ్లీ పంట కాలం వచ్చే వరకు కూడా విక్రయించకపోవడంతో పాడైపోయి నష్టపోయారు. ఈ సారి కూడా ధర వస్తుందని సాగు చేసినా, తీరా మద్దతు ధర లేక రైతులకు నష్టం జరుగుతున్నది. ఇప్పటికైనా అధికారులు మద్దకు ధరకు పత్తి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

విశ్రాంత జీవితం అనందంగా గడపాలి

- బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ తిరుపతి

చెక్కు అందిస్తున్న బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి

రెబ్బెన, జనవరి 9 : సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన అనంతరం వచ్చే డబ్బులు చాలా పొదుపుగా వాడుకొని విశ్రాంత జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహించిన అచ్చె సత్యనారాయణ మెడికల్ ఇన్ వ్యాలిడేషన్ అయ్యాడు. కాగా వారసులకు ఉద్యోగం, నెల వారి జీవనభృతికి కాకుండా ఏక మొత్తం చెల్లింపు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో ఆదాయ పన్ను మినహాయింపు కాగా, మంజూరైన రూ.19,15,000 చెక్కును గోలేటి జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో విజయపరంపర సాగిద్దాం

ట్రోఫీని అందుకుంటున్న ఐటీడీఏ పీవో బాజ్‌పాయ్

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి
- ప్రతిభ చాటిన క్రీడాకారులకు అభినందన

ఉట్నూర్, జనవరి 9: వచ్చే సంవత్సరం ఉట్నూర్ వేదికగా నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడల్లో ఈ విజయ పరంపరను సాగిద్దామని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి అన్నారు. మంగళవారం పీవో క్యాంపు కార్యాలయంలో కిన్నెరసానిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో విజేత ట్రోఫీని పీవోకు అందించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులు, కోచ్‌లు, ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వచ్చే సంవత్సరం రాష్ట్రస్థాయి పోటీలు ఉట్నూర్ వేదికగా జరగనున్నాయని, అప్పటికి అన్ని క్రీడల్లో క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ ఇవ్వాలన్నారు. అలాగే ఈ విజయాలు కొనసాగించాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు గోడం చందన్, మడావి కృష్ణారావు, ప్రేమ్‌దాస్, ఉత్తమ్‌దాస్, రాథోడ్ ప్రకాశ్, గోపాల్, క్రీడాధికారి పార్థసారథిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏపీవో భీంరావ్, ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, పీడీలు హేమంత్, శ్రీనివాస్, శేఖర్, సునంద్ పాల్గొన్నారు.

జంగుబాయి దేవస్థానంలో దీపారాధన

గుండాలలో సమావేశమైన ఎనిమిది గోత్రాల ఆదివాసులు

నార్నూర్, జనవరి 9 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోళి గ్రామ శివారులో కొలువుదీరిన జంగుబాయి దేవస్థానంలో ఈ నెల 14వ తేదీన ఆదివాసుల సంప్రదాయ ప్రకారం దీపారాధన ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మారప బాజిరావ్ తెలిపారు. మండలంలోని గుండాల గోండుగూడలో మహారాష్ట్రతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది గోత్రాల ఆదివాసులు మంగళవారం సమావేశమయ్యారు. దేవస్థానంలో సౌకర్యాలు,ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్య అమవాస్యను పురస్కరించుకొని ఆదివాసులు జంగుబాయి దేవస్థానంలో నెల రోజుల పాటు మొక్కులు చెల్లించుకుంటారని, జనవరి14న దీపారాధన, 15 నుంచి నెల రోజులు పూజలు నిర్వహిస్తారని, 25న మహా పూజ ఉంటుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారన్నారు. దేవస్థానంలో వసతుల ఏర్పాటు కోసం ఉట్నూర్ ఐటీడీఏ పీవోకు తీర్మానం చేసి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొడప జాకు, ఉపాధ్యక్షుడు రాయిసీడం జంగు, శ్రీరామ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా మాధ్యమిక విద్యాధికారి శ్రీనివాస్‌కుమార్

నార్నూర్, జనవరి 9 : ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి శ్రీనివాస్‌కుమార్ అధ్యాపకులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. కళాశాలలో మౌళిక వసతులతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. తరగతిని సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గైర్హజరు కాకుండా చూడాలన్నారు. వెనుబడిక విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలన్నారు. అధ్యాపకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ జాదవ్ గణేశ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ టీ మహేందర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీకాంబ్లే, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకి అయ్యప్ప దీక్షాపరులు

ఇరుముడి కడుతున్న అయ్యప్ప దీక్షాపరులు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 9 : పట్టణానికి చెందిన పలువురు అయ్యప్ప దీక్షాపరులు మంగళవారం శబరిమలైకి బయల్దేరారు. 41 రోజుల మండల దీక్ష అనంతరం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో రెబ్బెన మండలానికి చెందిన గురు స్వామి ముసునూరి సూర్య భాస్కర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీక్షాపరులకు ఇరుముడి కట్టారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో శబరిమలైకి బయల్దేరారు. వారిలో గురు స్వాములు దూడల అశోక్, చిట్టిమల్ల సంతోష్, వేణుగోపాల్, బట్టుపల్లి సంతోష్, షెండే గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

7,300 ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్

రెబ్బెన, జనవరి 9 : రెబ్బెన మండలంలో 11,156 ప్రజాపాలన దరఖాస్తులు రాగా, మంగళవారం సాయంత్రం నాటికి 7,300 దరఖాస్తులు ఆన్‌లైన్ చేసినట్లు ఎంపీడీవో పరికిపండ్ల శ్రీనివాస్ తెలిపారు. మండలంలో మొత్తం 16 కంప్యూటర్లు ఏర్పాటు చేసి, పకడ్బందీగా అన్‌లైన్ ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు చదివి, పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకునేలా సిబ్బందికి సూచనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

న్యాయ సంహిత చట్టం ఉపసంహరించుకోవాలి

తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన, జనవరి 9 : కేంద్రంలోని బీజేపీ సర్కారు ఇటీవల తీసుకొచ్చిన కేంద్ర న్యాయ సంహిత చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని నంబాల రైల్వే గేట్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆ తర్వాత తహసీల్దార్ సమీర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ సర్కారు కొత్తగా తీసుకవచ్చిన ఈ చట్టంలోని హిట్ అండ్ రన్ వెంటనే తొలగించాలని, ఈ చట్టం అమలులోకి వస్తే యాక్సిడెంట్ కేసుల్లో నేరం రుజువైతే డ్రైవర్లకు 10 ఏండ్ల జైలు శిక్షతో పాటు రూ.7 లక్షల జరిమానా పడుతుందన్నారు. మోదీ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేసారు. ఏఐటీయూసీ నాయకులు చేస్తున్న ధర్నాకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం జడ్పీటీసీ వేముర్ల సంతోష్, కోఆప్షన్‌మెంబర్ జొరొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు కుందారపు శంకరమ్మ, బొమ్మినేని శ్రీధర్ మాట్లాడుతూ.. న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేసే వరకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, తిరుపతి, లచ్చన్న, బుచ్చన్న, రవిప్రసాద్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

రెబ్బెన, జనవరి 9 : సింగరేణిలో పని చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయం ఎదుట మంగళవారం సాయంత్రం ఏఐటీయూసీ కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సింగరేణిలో చాలా ఏండ్ల నుంచి చాలీచాలనీ వేతనాలు తీసుకుంటూ సింగరేణి సంస్థకు లాభాలు తీసుకరావడంలోనూ సంస్థ అభివృద్ధి చెందడంలోనూ అత్యంత కీలకపాత్ర పోషిస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులను గుర్తించి, డ్రైవర్లకు రూ.32 వేలు, క్లీనర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలన్నారు. బోనస్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ప్రతి నెలా 10వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలు అందించాలని, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షుడు లచ్చన్న, రవి ప్రసాద్, కార్యదర్శులు బుచ్చన్న, కృష్ణ, జాయింట్ సెక్రటరీ సాగర్, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు నంది రాజ్‌కుమార్, కొండగుర్ల చందు, జ్యోతిరావు పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా షేక్ జయంతి

బెజ్జూర్, జనవరి 9 : మండల కేంద్రంలోని కేజీబీవీ, గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో మంగళవారం ఆధునిక భారత తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 193వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ముస్లింల సంప్రదాయాలను పాటిస్తూనే మహిళల అభ్యన్నతికి చదువు చాలా ముఖ్యమని భావించి ఫాతిమా షేక్ ఉపాధ్యాయురాలిగా పని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు జావీద్ అలీఖాన్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫాతిమా షేక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీటీసీ, పాఠశాల సిబ్బంది

బోనాల వేడుకలు

అగ్నిగుండ ప్రవేశానికి సిద్ధమవుతున్న భక్తులు

దహెగాం, జనవరి 9 : మండలంలోని చౌక గ్రామ పంచాయతీ పరిధి యేటిగూడ గ్రామంలో సోమవారం రాత్రి భీమదేవర బోనాల వేడుకలు కనుల పండుగగా నిర్వహించారు. ఆదివాసుల సంప్రదాయ వేడుక అయిన ఈ బోనాలు వారం ముందు నుంచే లక్ష్మీ దేవర, పాండవదేవలను ఊరేగింపుతో పాటు, ఆటపాట చేపట్టి ఆదివారం గంగ స్నానం చేయించారు. అనంతరం సోమవారం బోనాల వేడుక నిర్వహించారు. దహెగాం మండలంతో పాటు వివిధ మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి బోనాలు సమర్పించారు. అలాగే భక్తులు అగ్నిగుండాల ప్రవేశం చేశారు. మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజలక్ష్మి పాల్గొని, మొక్కులను చెల్లించుకున్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, జనవరి 9 : పీఆర్టీయూ టీఎస్ 2024 క్యాలెండర్‌ను మండలంలోని జడ్పీఎస్ఎస్ భట్టుపల్లి, జడ్పీఎస్ఎస్ చింతగూడ పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో సోమవారం మండల శాఖ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఏటుకూరి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ టీఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. మండలానికి ఎంఈవో, జిల్లా విద్యాధికారి పోస్టు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ మండళ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎనగంటి భిక్షపతి, పత్తిపాక శ్రావన్‌కుమార్, సెక్రటరీ సుజాత, అసోసియేటెడ్ అధ్యక్షుడు రామన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబురావు, సాంబన్న, గణపురం సంపతి, ప్రధానోపాధ్యాయులు అనురాధ, సుధాకర్, ఆనంద్‌రావు, కవిత, విజయలక్ష్మి, దేవాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భట్టుపల్లి పాఠశాలలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు